క్లుప్తంగా

కమనీయం.. పార్వతీదేవి కల్యాణం



పార్వతీదేవి కల్యాణంలో పాల్గొన్న ధర్మకర్త కుటుంబ సభ్యులు

గోపాలపట్నం: కొత్తపాలెం ఏఈఎస్ పంప్ హౌస్ వద్ద వెలసిన శ్రీపార్వతీ సహిత చంద్రోశేఖర ఆలయంలో బుధవారం వైభవంగా పార్వతీదేవీ కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దాడి వెంకటరమేష్ కుటుంబ సభ్యులు కల్యాణంలో పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా ఆలయ అర్చకుడు పంచాగం శ్రవణం చేశారు.

ఘనంగా రాములోరి పెళ్లిరాట



గవర వీధి రామాలయం వద్ద పందిరి రాట వేస్తున్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం పలు రామాలయాల వద్ద పందిరి రాట కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గవర వీధి రామాలయం వద్ద రాట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గోపాలపట్నం రామాలయం వద్ద ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పందిరిరాట వేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత భగత్‌సింగ్



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మల్కాపురం: భారత స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని సీపీఐ నాయకుడు గుడాల రాంబాబు కొనియాడారు. మల్కాపురం గ్రామమండలి వద్ద ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దొక్కాడ తిరుపతిరావు, శంకరరావు, రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న నాయీ బ్రాహ్మణ జేఏసీ ప్రతినిధులు

మల్కాపురం: స్థానిక నాయీ బ్రాహ్మణ జేఏసీ ప్రతినిధులు బుధవారం ఆ సామాజిక వర్గంలోని పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా మల్కాపురం,శ్రీహరిపురం,ప్రకాష్‌నగర్,జనతాకాలనీలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రామకృష్ణ గొలుకొండ,ఉప్పలపు లోవరాజు మహిళలకు చీరలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో ప్రతినిధులు మల్లేశ్వరరావు,శివకుమార్,అప్పారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని పెద్దవాల్తేరుకు చెందిన పేరి రామభాస్కరరావు అనేదాత లక్ష 1116 రూపాయాల విరాళం ఇచ్చారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో సంబంధిత విరాళాన్ని చెక్కురూపంలో పీఆర్వో నాయుడుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు.

వాడవాడలా ఉగాది సంబరాలు



ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



భూషణం మాస్టార్‌ను సత్కరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



మర్రిపాలెం వుడా లేఅవుట్ కల్యాణ మండపంలో ఉగాది వేడుకలు ప్రారంభిస్తున్న జియ్యాని శ్రీధర్

- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా పండగ
- సామాజిక సేవకులకు సత్కారం

గోపాలపట్నం: నియోజకవర్గంలో వాడవాడలా బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉగాది సంబరాలు మిన్నంటాయి. పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆడారి ఆనంద్‌కుమార్ వేడుకలను ప్రారంభించి అందరికీ శోభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదంతా నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ పరిశీలకుడు ఎస్‌ఏ రెహ్మాన్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కో ఆప్షన్ సభ్యుడు బెహరా భ్కారరావు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. మధ్యాహ్నం నుంచి నియోజకవర్గంలోని మహిళలు పార్టీ కార్యాలయ ప్రాంగణంలోని రహదారిని రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గంలోని 14వ వార్డుల్లో విశిష్ట సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్.తాతాబాబు, శంకర్‌దాస్, బి.వెంకటరావు, పి.వి.రమణ, ఎస్.వి.రమణ, పెంటారావు, విడి ఈశ్వరరావు, భాగ్యలక్ష్మి, ఎన్.శ్రీనివాసరావు, ప్రభాకర్, కాళ్ల కృష్ణమనాయుడు, దాడి పైడిరాజు, ఇంటూరి భూషణ్ (భూషణం మాస్టార్), శర్మ, వంజరపు రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. మహిళలు కోలాట మాడి సందడి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు.,మాజీ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల సభ్యులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో..

మర్రిపాలెం వుడా లేఅవుట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మండపంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. వేడుకలను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. అనంతరం పురోహితుడు పంచాంగ శ్రవణం చేశారు. ఏడాదంతా ఏవిధంగా ఉంటుందో గ్రహ స్థితిగతులను వివరించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్‌వీ సురేష్, వైస్ ప్రెసిడెంట్ రాజు, సంయుక్త కార్యదర్శి కె.అరుణశ్రీ, కోశాధికారి బి.కనకారావు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మల్కాపురం: శోభకృత్‌నామ సంవత్సర (ఉగాది) పర్వదినాన్ని పారిశ్రామిక వాసులు ఘనంగా నిర్వహించారు. తెలుగు సంప్రదాయ వస్త్రాలను ధరించి, ఇంటిని రంగురంగు పూలతో అలంకరించుకున్నారు. దేవుని మందిరంలో తమకు నచ్చిన దేవునికి పూజలు చేసి ఈ ఏడాది అంతా మంచే జరగాలని ప్రార్థించారు. ఇంట్లో తయారు చేసిన ఉగాది పచ్చడిని ఇంట్లో వారితో పాటు బంధువులకు తినిపించారు. ఉగాది సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన దుర్గాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించారు.గణపతి హోమం నిర్వహించారు.

- శ్రీహరిపురంలోని హరి హర క్షేత్రం, కొత్తరామాలయంలో,జనతాకాలనీలోని జైదుర్గా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



ప్రత్యేక పూజలందుకుంటున్న గణనాథుడు



అన్నయ్యకు ఉగాది పచ్చడి తినిపిస్తున్న చెల్లెలు

ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో గత నెలలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. గత నెల 28న హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సమీపంలో వేస్ట్ ఆయిల్ మండించే సమయంలో పైపు లీక్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో 104 ఏరియా ప్రాంతానికి చెందిన జి.రమణ(51) తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి ఆరిలోవలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. దీంతో రమణ కుటుంబానికి న్యాయం చేయాలని ఆస్పత్రి నిరసన చేపట్టారు. పరిహారంతో పాటు మృతుడి కుటుంబంలో ఒకరి ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్లు ఆదర్శంగా మెలగాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శన్‌రావు

మల్కాపురం: ఆటో నడుపుతూ పలువురు డ్రైవర్లు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శనరావు అన్నారు. 61వ వార్డు మల్కాపురం బస్టాప్ వద్ద గల శ్రీ జై దుర్గ ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం మజ్జిగ పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్ఐ సుదర్శనరావు ఆటో డ్రైవర్లు మెలగాల్సిన తీరుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బసవ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు ధనాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జోరీగల దుర్గారావు,కోశాధికారి నొట్ల సోమరాజులతో పాటు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు దుర్భరం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం స్టీల్‌ప్లాంట్ కార్మికుల, ఉక్కు నిర్వాసితుల జీవితాలను రోడ్డున పడేసిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 769వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఓబీసీ ఉద్యోగులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ దేశంలో ప్రజలంతా ఉగాది పండగను సంతోషంగా జరుపుకొంటుంటే, ఉక్కు కార్మికులు మాత్రం తమ జీవితాల గురించి చింతిస్తూ బాధతో పండగను జరుపుకొంటున్నారన్నారు. 30 ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్‌ను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు ఆ పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని, కార్మికులు ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



మృతుడు

సింహాచలం: పెందుర్తి రైల్వేస్టేషన్ సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద రైల్వే పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు విశాఖ జీఆర్‌పీ ఎస్ఐ బి.కామేశ్వరరావు తెలిపారు. సుమారు 75 ఏళ్ల ఉన్న వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో మృతిచెందినట్టు తెలిపారు. నీలం రంగు నిక్కర్, కనకాంబరం రంగు హాఫ్ హ్యాండ్ షర్టు ధరించి ఉన్న వ్యక్తి మొలతాడుకు బీరువా తాళం చెవి ఆకారం కలిగిన తాళాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 89857 52107 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం




దేవీపురంలో పూజలందుకున్న లలితాంబిక

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి క్షేత్రంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ యంత్ర మహామేరు ఆలయం ముందు గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శ్రీమేరు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కలశాలను వేదమంత్రాల సహితంగా ప్రాణ ప్రతిష్ఠ గావించిన లలితాంబికా అమ్మవారిని భక్తులు తోడ్కొనివచ్చి నవయోని రేఖచిత్రం మధ్యలో ఆశీనులను చేశారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం , ఖడ్గమాల, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి సహిత బాల హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ప్రేమ్ చందు మీనన్, పూణే నుంచి వచ్చిన పూనం ప్రధాన్, ముంబై నుంచి వచ్చిన అర్చన ఆర్య తోపాటు భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సింహగిరికి ఉగాది శోభ

- విశేషంగా నిత్య కల్యాణం
- భక్తులతో కిటకిటలాడిన అప్పన్న ఆలయం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్య కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



పుష్పాలంకరణలో అప్పన్న ఆలయం

సింహాచలం: సింహగిరి బుధవారం ఉగాది శోభను సంతరించుకుంది. శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని భక్తులు సింహగిరికి పోటెత్తారు. క్యూలో బారులు తీరి వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఉగాది సందర్భంగా స్వామివారి ఆలయంతో పాటు ఆస్థానమండపం..కల్యాణమండపాన్ని పుష్పాలతో అలంకరించారు. అలాగే భక్తులందరికీ దర్శనానంతరం ఉగాది పచ్చడి అందజేశారు. సింహగిరిపై ఉన్న త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో కూడా భక్తుల రద్దీ కొనసాగింది.

నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు శ్రీకాంతాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముత్యాల తలంబ్రాల వితరణ



ఏఈవోకు ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న దాత

సింహాచలం: వచ్చే నెల 2న సింహగిరిపై జరిగే వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన విజయలక్ష్మి డైమండ్స్ అధినేత శివశంకర్‌రాజు రూ.90వేలు విలువ చేసే ముత్యాల తలంబ్రాలు వితరణగా ఇచ్చారు. సింహగిరిపై ఆలయంలో ఏఈవో నరసింహరాజుకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, రామలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో అన్నదానం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఉగాది సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ అన్నదానం ప్రారంభించి 13 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భక్తులు, పేదలకు ప్రత్యేక అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయిబాబాకు విశేష పూజలు జరిపారు.

వివిధ రంగాల్లో ప్రముఖులకు సత్కారం



రచయిత సుంకర చలపతిరావును సత్కరిస్తున్న గ్రంథాలయ కమిటీ ప్రతినిధులు



భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ సుధ

మల్కాపురం: శోభ కృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా పలు రంగాల్లో విశేష సేవలందించిన వారిని సత్కరించారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ప్రముఖ చిత్రకారుడు, రచయిత సుంకర చలపతిరావును ముఖ్యఅతిథి డాక్టర్ హేమలత సత్కరించారు. అలాగే ప్రముఖ న్యాయవాది విశ్వనాథ్‌రాజ్‌తో పాటు కార్మిక నాయకులు బి.సత్యానందం ,రచయిత కె.సత్తిరాజులు, ప్రజా ఉద్యమ నాయకుడు టి.శ్రీరామమూర్తి తదితర ప్రముఖులను సత్కరించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన ఉగాది సంబరాల్లో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఘనంగా సత్కరించారు.

బలహీన వర్గాలకు అండగా సమతా సైనిక్ దళ్



మల్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సమతా సైనిక్ దళ్ సభ్యులు

సింధియా: పేదవారిపై అగ్రకులాల అణచివేత, ఆధిపత్యం కోసం జరుగుతున్న దాడులను ఖండించేందుకు సమతా సైనిక్‌దళ్ అవసరం ఎంతైనా ఉందని ఎస్ఎస్‌డీ జిల్లా కమాండ్ కొత్తాబత్తుల ప్రసాదరావు, ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు అన్నారు. ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ 96వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాష్‌నగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1927 మార్చి 19న సమతా సైనిక్‌దళ్‌ను అంబేడ్కర్ స్థాపించారని, 1937లో ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఎన్నికల్లో సమతా సైనిక్‌దళ్ కీలక పాత్ర పోషించిందన్నారు. అంబేడ్కర్ బౌద్ధ మతం స్వీకరించినప్పటి నుంచి సమతా సైనిక్‌దళ్ అంగరక్షణగా ఉందని కొనియాడారు. నేషనల్ అవార్డు గ్రహీత యూవీరావ్ వందన సమర్పణతో సభ ముగిసింది. కార్యక్రమంలో పెయ్యల సిద్ధార్థ, వేణుగోపాల గౌతమ్, మల్లయ్యరాజు, బడుగు సుబ్బారావు, కాకర రమణ, గౌతం బాబు, కాకర రాజు, గుడాల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

- సీబీఐ కోర్టు ప్రిన్సిపాల్ స్పెషల్ జడ్జి సత్యవెంకట హిమబిందు



మహిళలకు దుప్పట్లు అందజేస్తున్న సీబీఐ కోర్టు ప్రిన్సిపాల్ స్పెషల్ జడ్జి సత్యవెంకట హిమబిందు

పద్మనాభం: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సీబీఐ కోర్టు ప్రిన్సిపాల్ స్పెషల్ జడ్జి బి.సత్య వెంకట హిమ బిందు సూచించారు. మండలంలోని కురపల్లిలో గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, అశోక్ హీరావత్ సంయుక్తంగా మహిళా హక్కులు, చట్టాలపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ మహిళ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని సూచించారు. గృహ హింస చట్టం 498/ఏను సరైన మార్గంలో అనుసరించాలని తెలిపారు. బాల్య వివాహ చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలను ప్రోత్సహిస్తున్నారని, ఇది చట్ట రీత్యా నేరమన్నారు. భర్త నుంచి కోర్టులో విడాకులు తీసుకున్న మహిళ తనతోపాటు పిల్లలకు మనోవర్తి పొందేందుకు చట్టం అవకాశం కల్పించిందన్నారు. అబార్షన్లు, భ్రూణ హత్యలు నేరమన్నారు. బాలికలను లైంగికంగా వేధించేవారికి పోక్సో చట్టంతో గుణపాఠం చెప్పాలని సూచించారు.

ఉచితంగా న్యాయ సేవలు

గ్రామీణ ప్రాంతాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రారంభిస్తామని సీబీఐ కోర్టు ప్రిన్సిపాల్ స్పెషల్ జడ్జి బి.సత్య వెంకట హిమ బిందు తెలిపారు. అవసరమైన వారు జిల్లా న్యాయ సేవ అథారిటీ, పారా లీగల్ వలంటీర్, న్యాయవాది ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని సూచించారు. సమస్యలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. విద్య, ఆస్తి, రాజకీయ రంగాల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నాయని తెలిపారు. లింగ వివక్ష చూపకుండా ఆడ పిల్లలను తప్పనిసరిగా చదివించాలన్నారు. డొమెస్టిక్ వయలెన్స్ యాక్ట్‌ను అత్యవసర పరిస్థితుల్లో వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 250 మంది పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పౌరాణిక రంగస్థల నటుడు ఉప్పాడ అప్పారావును సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్.సునీల్ కుమార్, రాజీవ్ గాంధీ మానవ సేవా జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, భీమిలి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎస్.జనార్ధనరావు, ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ డి.పుల్లారావు, ఎస్.శ్రీలక్ష్మి, జి.మైథిలి, ఊహా మహంతి, అశోక్ హీరావత్, ఎస్.మహేష్ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



ఉగాది పురస్కారాలు అందుకున్న కవులు, ఇతర ప్రముఖులు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురంలోని సీతారామ కల్యాణ మండపంలో పోర్ట్ సాంస్కృతిక సంస్థ సాగరి ఆధ్వర్యంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథి పోర్ట్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ ఆర్.ఎన్.హరికృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోర్ట్ రిటైర్డ్ హిందీ అధికారి పి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పి.ఫ్రాన్సిస్ కవి సమ్మేళనాన్ని నిర్వహించగా.. ప్రముఖ కవి డాక్టర్ కేజీ వేణు సమీక్షించారు. ప్రముఖ వ్యాఖ్యాత పి.అభిషేక్‌ను ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త, పంచాంగ కర్త అడబాల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. 40 మంది కవులు, కవయిత్రులు కవితలను వినిపించారు. పోర్ట్ రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ ఆర్ రాములు, సాగరి వైస్ ప్రెసిడెంట్ అవతారం నాయుడు, కార్యదర్శి ధర్మారావు, కార్యవర్గ సభ్యులు శ్రీధర్, చంద్రరావు, సత్యారావు, సూరిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

సామాన్యులకు నటనలో శిక్షణ

సీతంపేట: సామాన్యులకు నటనలో శిక్షణ ఇవ్వాలనే సదుద్దేశంతో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించామని డైరెక్టర్ ఎస్.టి.నాయుడు తెలిపారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద షిర్డీసాయి స్కూల్ ఎదురుగా డాక్టర్ ఎస్.టి.నాయుడు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, డ్యాన్స్ అకాడమీలను బుధవారం ఆయన ప్రారంభించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నటనపై ఎంతోమందికి ఆసక్తి ఉన్నా ఆర్థిక స్తోమత లేక చాలా మంది వెనుకంజ వేస్తున్నారన్నారు. ప్రస్తుత రోజుల్లో నటనలో శిక్షణ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని విశాఖ నగరంలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ సంస్థలో యాక్టింగ్, స్క్రిప్ట్ రైటింగ్, యాంకరింగ్, డైరక్షన్, డ్యాన్స్‌ల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. మూడు నెలలు థియరీ, మరో మూడు నెలలు హైదరాబాద్‌లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణలో ప్రతిభ చూపిన నటీనటులతో సొంతంగా సినిమా నిర్మిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 85558 40515 నంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ నాయుడు కోరారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ కె.జయలక్ష్మి పాల్గొన్నారు.